- హ్యాట్రిక్ కోసం హ్యాపీగా బీఆర్‌ఎస్ అభ్యర్థులు
- పాలమూరు, దేవరకద్ర, జడ్చర్ల, కందనూలు, పేట, మక్తల్, అచ్చంపేటలో గెలుపు దిశగా..
- 2014, 2018 ఎన్నికల్లోనూ విజయఢంకా
- ఈసారి విజయం కోసం వ్యూహరచన
- విపక్షాలకు పరీక్షగా మారిన ఏడు సెగ్మెంట్లు
- కారు స్పీడుకు చేతులెత్తేసిన కాంగ్రెస్, కమలం

ఔర్ ఏక్ ధక్కా.. హ్యాట్రిక్ పక్కా

ఉమ్మడి జిల్లాలో కారు టాప్‌గేరు

మహబూబ్‌నగర్, నవంబర్ 11 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఏడు నియోజకవర్గాల గెలుపోటములపై ఉత్కంఠ నెలకొన్నది. 2014, 2018 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి వి.శ్రీనివాస్‌గౌడ్, జడ్చర్ల నుంచి లక్ష్మారెడ్డి, దేవరకద్ర నుంచి ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, అచ్చంపేట నుంచి గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి, మక్తల్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట నుంచి ఎస్.రాజేందర్‌రెడ్డి వరుసగా రెండుసార్లు గెలుపుబావుటా ఎగురవేశారు. ముచ్చటగా మూడోసారి గెలుపొందేందుకు ఉవ్విళ్లూరుతున్నారు. హ్యాట్రిక్ విజయాన్ని అడ్డుకునేందుకు విపక్షాలు ఎత్తుగడలు వేస్తుంటే బీఆర్‌ఎస్ అభ్యర్థులు వాటిని చిత్తుచేస్తున్నారు. మొత్తం 12 నియోజకవర్గాల్లో హోరాహోరీ పోరు నడుస్తుండగా, ఏడు నియోజకవర్గాల్లో కారుస్పీడుకు బ్రేకులు వేయాలని విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. ఈ సెగ్మెంట్లలో కాంగ్రెస్ పార్టీ పోటీకి నిలబెట్టిన చోట ఐదు సెగ్మెంట్లలో తీవ్ర అసమ్మతి నెలకొంది. టికెట్లు ఆశించి భంగపడ్డ వారంతా కారెక్కడంతో రాజకీయ పరిణామాలు మలుపు తిరిగాయి. ఈ నియోజకవర్గాల్లో ప్రత్యర్థుల మధ్య చీలికలు కలిసొచ్చే అంశంగా భావిస్తూ దూసుకుపోతున్నారు. ఈసారి ఔర్ ఏక్ దక్కా.. హ్యాట్రిక్ పక్కా అంటూ ముందుకు దూసుకుపోతున్నారు. తెలంగాణ ఆవిర్భావం తర్వాత ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని 14 నియోజకవర్గాల్లో 2014లో ఆరు స్థానాల్లో బీఆర్‌ఎస్ విజయం సాధించింది. తొలి తెలంగాణ రాష్ట్రానికి పార్టీ అధినేత కేసీఆర్ ముఖ్యమంత్రి బాధ్యతలు తీసుకున్నారు. జడ్చర్ల ఎమ్మెల్యే లక్ష్మారెడ్డికి మంత్రి వర్గంలో కూడా స్థానం లభించింది. కాంగ్రెస్ నుంచి గెలుపొందిన మక్తల్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, టీడీపీ నుంచి గెలుపొందిన నారాయణపేట ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డి కారెక్కారు. దీంతో బీఆర్‌ఎస్ బలం ఎనిమిదికి చేరుకున్నది. 2018 ఎన్నికల్లో కారు ప్రభంజనం సృష్టించడంతో ఏకంగా ఉమ్మడి జిల్లాలో 13 నియోజకవర్గాలు గెలిచి టాప్‌గేర్‌లో దూసుకుపోయింది. అనంతరం జరిగిన రాజకీయ పరిణామాలతో కొల్లాపూర్‌లో కాంగ్రెస్ నుంచి గెలిచిన ఎమ్మెల్యే బీరం హర్షవర్ధన్‌రెడ్డి కారెక్కడంతో ఉమ్మడి జిల్లాలో క్లీన్‌స్వీప్ చేసినట్లయ్యింది. 2014, 2018 ఎన్నికల్లో మహబూబ్‌నగర్ నుంచి వి.శ్రీనివాస్‌గౌడ్, జడ్చర్ల నుంచి లక్ష్మారెడ్డి, దేవరకద్ర నుంచి ఆలవెంకటేశ్వర్‌రెడ్డి, అచ్చంపేట నుంచి గువ్వల బాలరాజు, నాగర్‌కర్నూల్ నుంచి మర్రి జనార్దన్‌రెడ్డి, మక్తల్ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి, నారాయణపేట నుంచి ఎస్.రాజేందర్‌రెడ్డి వరుసగా రెండు సార్లు గెలుపుబావుటా ఎగురవేశారు. ఈసారి కూడా బీఆర్‌ఎస్ తరఫున మళ్లీ పోటీకి దిగుతుండడంతో ఈ సెగ్మెంట్లలో ఎన్నికలు ప్రతిష్ఠాత్మంగా మారాయి. ఈసారి గెలిస్తే వరుసగా మూడు సార్లు గెలిచి హ్యాట్రిక్ రికార్డు సొంతం చేసుకుంటారు. అందరి దృష్టి ఈ నియోజకవర్గాలపై పడింది. ఈ సెగ్మెంట్లలో కాంగ్రెస్‌తో బీఆర్‌ఎస్‌కు ముఖాముఖి పోరు ఉండబోతుంది. బీజేపీ నామమాత్రపు పోటీ ఇచ్చే అవకాశాలున్నాయి. ప్రచారంలో దూసుకుపోతున్న గులాబీదళం మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్, నారాయణపేట జిల్లాల్లో ప్రచారంలో దూసుకుపోతున్నది. అన్ని జిల్లాల్లో పోటాపోటీగా నామినేషన్లు దాఖలు చేశారు. భారీఎత్తున ర్యాలీలు చేపట్టి తడాఖా చూపించారు. కాగా మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, మక్తల్, నారాయణపేట, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాల్లో పోటీకి దిగిన అభ్యర్థులకు హ్యాట్రిక్ చాన్స్ ఉంది. ముచ్చటగా మూడోసారి గెలుపొంది ఈసారి హ్యాట్రిక్ సాధించాలని వ్యూహాలు రచిస్తున్నారు. ఈ ఏడు సెగ్మెంట్లలో ఐదు చోట్ల కాంగ్రెస్‌తో ముఖాముఖి పోటీ ఉండగా, రెండుచోట్ల త్రిముఖ పోటీ నెలకొన్నది.

బీఆర్‌ఎస్ అభ్యర్థుల ప్రచార జోరు..

మహబూబ్‌నగర్‌లో మంత్రి శ్రీనివాస్‌గౌడ్ హ్యాట్రిక్ విజయం కోసం పార్టీ నాయకులు, కార్యకర్తలు గడపగడపకు ప్రచారం చేస్తున్నారు. గతంలో ఇచ్చిన మెజార్టీకి మించి గెలిపించాలని శ్రమిస్తున్నారు. జడ్చర్లలో లక్ష్మారెడ్డి ఉదయం ఏడు గంటల నుంచే ప్రచారంలో ఉంటున్నారు. నియోజకవర్గంలోని చేరికలపై దృష్టి పెడుతున్నారు. దేవరకద్రలో ఆల వెంకటేశ్వర్‌రెడ్డి తనదైన శైలిలో ప్రచారం చేపడుతున్నారు. మక్తల్‌లో చిట్టెం రామ్మోహన్‌రెడ్డి ఉదయమే గ్రామాలకు వెళ్తున్నారు. కార్యకర్తలతో కలిసి ఇంటింటి ప్రచారం చేపడుతున్నారు. నారాయణపేటలో రాజేందర్‌రెడ్డి గ్రామాగ్రామాన బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ కార్యక్రమాల కరపత్రాలను తీసుకెళ్లి ఓట్లు అభ్యర్థిస్తున్నారు. నాగర్‌కర్నూల్‌లో ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి తనదైన స్టైల్‌లో దూసుకుపోతున్నారు. కార్యకర్తలతో మమేకమై ఆకట్టుకుంటున్నారు. అచ్చంపేటలో గువ్వల బాలరాజు గ్రామగ్రామానికి వెళ్లి ప్రజలే తన కుటుంబమని ప్రచారంలో దూసుకుపోతున్నారు.

ఐదు చోట్ల ముఖాముఖి, రెండు చోట్ల త్రిముఖ పోటీ..

బీఆర్‌ఎస్ అభ్యర్థులు హ్యాట్రిక్ సాధించే స్థానాలపై అందరి దృష్టి పడింది. అందరికంటే ముందుగానే పార్టీ అధినేత టికెట్లు కేటాయించి బీఫారాలు అందించడంతో ప్రచార పర్వంలో బీజీ అయిపోయారు. ఈ ఏడు స్థానాల్లో ఎలాగైనా గెలవాలని గులాబీ దళం వ్యూహరచనలు చేస్తున్నారు. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, అచ్చంపేట, నాగర్‌కర్నూల్ జిల్లాలో ముఖాముఖి పోరు ఉండబోతున్నది. ఈ ఐదు స్థానాల్లో కాంగ్రెస్‌తో నే ప్రధాన పోటీ ఉండనున్నది. మక్తల్, నారాయణపేటలో మాత్రం కాంగ్రెస్, బీజేపీతో త్రిముఖ పోటీ నెలకొన్నది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రకటించిన అభ్యర్థుల్లో చాలామంది టికెట్లు కొన్నారనే ప్రచారం జరుగుతున్నది. మహబూబ్‌నగర్, జడ్చర్ల, దేవరకద్ర, నాగర్‌కర్నూల్‌లో తీవ్ర అసంతృప్తి వ్యక్తమై చాలా మంది సీనియర్లు, టికెట్ ఆశించి భంగపడ్డవారు కారెక్కేశారు. నాగర్‌కర్నూల్‌లో మాజీ మంత్రి నాగం జనార్దన్‌రెడ్డి కాంగ్రెస్‌ను వీడడంతో ఆ పార్టీకి పెద్ద దెబ్బేనని పరిశీలకులు అంటున్నారు. జడ్చర్ల, మహబూబ్‌నగర్‌లో బీసీ సామాజిక వర్గానికి చెందిన మాజీ మంత్రి పి.చంద్రశేఖర్, ఎర్రశేఖర్ గులాబీ గూటికి చేరడంతో ఈ నియోజకవర్గంలో రాజకీయ సమీకరణలు మారిపోయాయి. మక్తల్, నారాయణపేటల్లో కాంగ్రెస్, బీజేపీ అభ్యర్థుల ప్రకటన కూడా తీవ్ర అసంతృప్తికి ఆజ్యం పోసింది. కాంగ్రెస్ నుంచి టికెట్ ఆశించిన ప్రశాంత్‌కుమార్‌రెడ్డి తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. బీజేపీలో ఎన్నోఏండ్లుగా క్రమశిక్షణ కలిగిన నాయకుడిగా పేరుపడిన కొండయ్యను కాదని జలందర్‌రెడ్డికి టికెట్ ఇవ్వడంతో ద్వితీయ శ్రేణి నాయకులంతా కారెక్కుతున్నారు. నారాయణపేటలో కూడా కాంగ్రెస్ పార్టీ టికెట్‌ను బీసీలకు కాకుండా ఇతర సామాజిక వర్గాలకు ఇవ్వడంతో తీవ్ర అసంతృప్తిలో ఉన్నారు. బీజేపీ టికెట్‌ను ఆశించిన యువనేత సత్యయాదవ్‌ను కాదని ఓడిపోయే క్యాండెట్‌కు ఇవ్వడంతో ఆయన భగ్గుమంటున్నారు.

ఔర్ ఏక్ ధక్కా.. హ్యాట్రిక్ పక్కా..

ఉమ్మడి జిల్లాలోని 12 స్థానాల్లో ఏడింట్లో హ్యాట్రిక్ ఛాన్స్ ఉండడంతో అంతటా ఉత్కంఠ నెలకొంది. ఈ స్థానాల్లో ఎలాగైనా గెలవాలని బీఆర్‌ఎస్ భారీ స్కెచ్ వేసింది. హ్యాట్రిక్ విజయాన్ని ఆపేందుకు కాంగ్రెస్ వేసిన ఎత్తుగడలు చిత్తయ్యాయి. ఆ పార్టీకి చెందిన చాలామంది నేతలు ఒక్కొక్కరుగా బయటకు వెళ్లడంతో ఆ పార్టీ దిక్కుతోచని పరిస్థితిలో పడిపోయింది. బీజేపీలో కూడా సేమ్ సీన్ రిపీట్ అవుతున్నది. మరోవైపు ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు కర్ణాటక రాష్ట్రం కూడా సరిహద్దు కావడంతో అక్కడ సర్కార్ వైఫల్యాలు కండ్లకు కట్టినట్లు తెలుస్తున్నాయి. కరెంట్ ఇవ్వకపోవడం, తాగునీటి ఎద్దడి, రైతులకు ఎలాంటి సహాయం చేయకపోవడం, గ్యారెంటీలను ఇవ్వలేక చేతులెత్తేయడం వంటివి బీఆర్‌ఎస్‌కు కలిసి వస్తున్న అంశాలు. సాగునీరు, 24 గంటల కరెంట్, రైతుబంధు, రైతుబీమా అంశాలు బీఆర్‌ఎస్‌కు అనుకూలంగా మారాయి. అంతేకాక చిన్న జిల్లాల ఏర్పాటుతో అభివృద్ధి ప్రజల చెంతకు చేరింది. దీంతో అన్ని బలాలతో బీఆర్‌ఎస్ ఈసారి ఎన్నికల్లో కూడా గెలిచి తీరాలని భావిస్తున్నది. ఇప్పటికే పార్టీ అధినేత హ్యాట్రిక్ విజయం సాధించే నియోజకవర్గాల్లో పర్యటించారు. ఒక్క మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్ నియోజకవర్గాలు మాత్రమే మిగిలి ఉన్నాయి. ఈసారి హ్యాట్రిక్ సాధించి కేసీఆర్ హ్యాట్రిక్ సర్కారులో పాలుపంచుకుంటారా లేదా అనేది డిసెంబర్‌లో తేలనున్నది.

- ఆల ఆలోచనతో అభివృద్ధికి ఊతం
- కొమిరెడ్డిపల్లిలో చిన్న తూముతో పెరిగిన వరిసాగు
- సంబురంగా సాగు చేసుకుంటున్న రైతులు

బీడుభూములకు జీవం

పెద్దవాగుపై నిర్మించిన చెక్‌డ్యాం వద్ద ఏర్పాటు చేసిన తూం నుంచి వాగు ద్వారా చెరువులకు వస్తున్న వరద నీరు

మూసాపేట, నవంబర్ 11 : దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఆలోచన ఆ గ్రామ అభివృద్ధికి ఊతమిచ్చింది. వాగుపై నిర్మించిన చెక్ డ్యాంతోపాటు నిల్వ ఉండే నీటికి వాగు కాల్వ వద్ద ఒక చిన్న తూం ఏర్పాటు చేయడంతో గ్రామం పచ్చని పంటలతో కళకళలాడుతున్నది. మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లి గ్రామంలో వ్యవసాయ ఆధారిత కుటుంబాలే అధికం. సారవంతమైన భూములు ఉన్నా సాగునీరు లేక మురికి తుమ్మచెట్లు మొలిచి పడావుగా మారాయి. తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ద్వారా మూసాపేట మండలంలోని పెద్ద వాగులో వదిలారు. దీంతో వాగు పరివాహక భూములు మాత్రం బోరుబావుల నుంచి పంటలు సాగుచేసుకున్నారు. దేవరకద్ర ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి వీలైనంత మేరకు ప్రతి గ్రామానికి సాగునీరు అందించాలనే సంకల్పంతో మరో అడుగు ముందుకేసి సీఎం కేసీఆర్ వద్దకు వెళ్లారు. దేవరకద్ర నియోజకవర్గంలో వాగులు ఎక్కువగా ఉన్నాయని, వాటిపై చెక్‌డ్యాంలు నిర్మిస్తే రైతులకు మేలు చేకూరుతుందని చెప్పడంతో సీఎం సానుకూలంగా స్పందించి ఇప్పటి వరకు మొత్తం 30 చెక్‌డ్యాంలు మంజూరు చేశారు. అందులో ఇప్పటికే 21 చెక్‌డ్యాంల నిర్మాణాలు పూర్తయ్యాయి. అందులో ఒకటి సంకలమద్ది గ్రామ శివారులో కొమిరెడ్డిపల్లి వాగు కాల్వకు దిగువ భాగంలో చెక్‌డ్యాం నిర్మించారు. చెక్‌డ్యాం శంకుస్థాపనకు వెళ్లిన ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి వాగు కాల్వను చూయించి ఈ కాల్వ ద్వారా సాగు నీరు వస్తే చెరువులు నిండి పంటలు పుష్కలంగా పండుతాయని రైతులు చెప్పారు. అందుకు ఎమ్మెల్యే ఆల సొంత ఖర్చుతో కాల్వ పూడిక తీయించారు. కానీ వరద ఎక్కువగా వస్తే కాల్వపై నుంచి వరద నీరు వెళ్లి పంటలు పాడవుతున్నాయని కొంత మంది రైతులు ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. అదేవిధంగా కాల్వ ద్వారా సాగునీరు వస్తే కేవలం కొమిరెడ్డిపల్లి గ్రామమే కాకుండా అడ్డాకుల మండలంలోని పొన్నకల్ గ్రామం మీదుగా రాచాల వరకు ఉన్న చెరువులకు నీరు వచ్చి చేరుతుందని అడ్డాకుల ఎంపీపీ దోనూరు నాగార్జునరెడ్డి, జెడ్పీటీసీ నల్లమద్ది రాజశేఖర్‌రెడ్డి ఆయా గ్రామాల రైతులు ఎమ్మెల్యేకు వివరించారు. దీంతో ఆయన చెక్‌డ్యాం వద్ద కాల్వను సందర్శించారు. చెక్‌డ్యాంపై కాల్వ ఉన్నందున ఎక్కువ వరద వచ్చి రైతులు ఇబ్బందులు పడకూడదని ఆలోచించి అధికారులకు కాల్వకు తూం ఏర్పాటు చేయాలని, అందుకు అవసరమైన నివేదికలు తయారు చేయాలని ఆదేశించారు. వెంటనే చెక్‌డ్యాం భాగంలో తూం ఏర్పాటు చేయించారు. తూం ద్వారా నేటికి వాగు కాల్వ ద్వారా వరద నీరు కొమిరెడ్డిపల్లి చెరువులకు వరద వచ్చి చేరుతున్నది. కొమిరెడ్డిపల్లిలోని చాకలికుంటకు వరద వస్తుంది. ఆ చెరువు నిండుకొని చెన్నయ్య చెరువు నిండుతుంది. ఆ చెరువు నుంచి కూడా దిగువకు వరద వెళ్తుంది. అయితే కొమిరెడ్డిపల్లి వ్యవసాయ భూములు ఎక్కువగా ఆ రెండు చెరువుల పాటుకే ఉంటాయి. ఆయకట్టు మొత్తం సాగవుతుడడంతోపాటు వాగు శివారు, కాల్వ శివారు పొలాల రైతులు కూడా ఎక్కడికక్కడ మోటర్లు వేసి, అశకాశం ఉన్న వ్యవసాయ బోర్ల కింద సాగు చేస్తున్నారు. దీంతో నేడు కొమిరెడ్డిపల్లిలో సాగు పెరిగింది. సాగునీరు లేక పంటలు ఎండకుండా రైతులకు మంచి దిగుబడి వచ్చి లాభపడుతుండడంతో రైతు కుటుంబాలతోపాటు గ్రామం కూడా అభివృద్ధి బాటలో నడుస్తున్నది. అందుకు గ్రామ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

చెక్‌డ్యాం వద్ద నిర్మించిన తూము

తూం నుంచి చెరువులకు నీటిని విడుదల చేస్తున్న ఐబీ సిబ్బంది (ఫైల్)

వందశాతం సాగు..

గతంలో సాగునీరు లేక చాలా మంది రైతులు పొలాన్ని అమ్ముకునే వారు. ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి సివిల్ ఇంజినీర్ కావడంతోపాటు రైతు కుటుంబంలో పుట్టడంతో ఎంతో మేలు చేసింది. ఆయన కృషితోనే మా గ్రామంలో చెక్‌డ్యాం వద్ద తూం ఏర్పాటు చేయించి సాగుకు పుష్కలంగా నీరు లభిస్తున్నది. దిగుబడి కూడా బాగా వస్తుండడంతో రైతులు ఆర్థికంగా లాభపడుతున్నారు. కరివెన ప్రాజెక్టు పూర్తయితే వందశాతం గ్రామాలకు సాగునీరు అందుతుంది. అభివృద్ధికి పాటుపడిన ఆల వెంకటేశ్వర్‌రెడ్డిని గెలిపించుకోవాల్సిన అవసరం, బాధ్యత రైతులపై ఉంది.

- లక్ష్మీనరసింహాయాదవ్, రైతు, కొమిరెడ్డిపల్లి

రైతు మాటను మర్చిపోలేను..

సీఎం కేసీఆర్ సహకారంతో కేఎల్ఐ ద్వారా ఎత్తిపోతలతో సాగునీరు మూసాపేట పెద్దవాగు ద్వారా పారించాం. ఆ నీటితోనే మూసాపేట మండలంలోని కొమిరెడ్డిపల్లిలో వరి పుష్కలంగా పండి దిగుబడి బాగా వచ్చింది. ఆ ధాన్యాన్ని కొమిరెడ్డిపల్లి జాతీయ రహదారి పక్కనే ఉండే సర్వీస్ రోడ్డుపై రైతులు ఆరబోశారు. ఆ సమయంలో అటువైపు వెళ్లిన నా వద్దకు ఓ రైతు వచ్చి సారు ఇవి కేసీఆర్ వడ్లు సార్ అని సంతోషంతో, గర్వంగా చెప్పాడు. రైతులు ఆ మాట చెప్పడంతో మేం పడిన కష్టమంతా ఒక్క క్షణంలో మర్చిపోయాం. మరింత ఉత్సాహంతో పనిచేయాలనిపించింది. సీఎం కేసీఆర్ సహకారంతో ప్రజలకు మరింత మంచి చేయాలన్నదే మా లక్ష్యం.

- ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, దేవరకద్ర ఎమ్మెల్యే

దివ్వెల దీపావళి

- నేడు ఇంటింటా వెలుగుల పండుగ
- పటాకుల మోతతో మోగనున్న వీధులు
- కొనుగోళ్లతో మార్కెట్లలో సందడి
- జోరుగా పటాకుల విక్రయాలు
- చెడుపై మంచి విజయానికి సంకేతం
- ధనత్రయోదశి, లక్ష్మీపూజకు ప్రత్యేకం
- బహురూపాల్లో ప్రమిదల లభ్యం
- ఉమ్మడి జిల్లాలో పెరిగిన ధరలు

నాగర్‌కర్నూల్ (నమస్తే తెలంగాణ)/వనపర్తి టౌన్, నవంబర్ 11 : హిందువుల పండుగలో దీపావళి పండుగ ముఖ్యమైనది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా ఈ పర్వదినాన్ని జరుపుకొంటారు. ప్రతి ఏడాది అశ్వాయుజ అమావాస్య రోజున పండుగను నిర్వహిస్తుంటారు. వేకువ జామునే ఇండ్లను శుభ్రం చేసుకొని నూతన వస్త్రాలతోపాటు వెండి, బంగారు ఆభరణాలతో ధన లక్ష్మి పూజలు చేస్తే అష్టైశ్వరాలు కలుగుతాయని నమ్మకం.

పండుగ నేపథ్యం

పురాణాలు, రామాయణం, మహాభారతంలో దీపావళి చరిత్రపై ప్రస్తావన ఉంది. భూదేవి వరాహ స్వామికి, నరకాసురుడికి జన్మనిస్తారు. నరకాసురుడి బాధలు భరించలేని దేవతలు, మునులు, గాంధర్వులు శ్రీహరికి గోడు వెల్లబోసుకుంటారు. ద్వారక నగరంలో కృష్ణుడిగా అవతరించి సత్యభామ సహకారంతో నరకాసురుడిని సంహరింపజేస్తారు. అలాగే లంకలో రావణుడిని హతమార్చి శ్రీరాముడు సీతాసమేతంగా అయోధ్యకు తిరిగి వచ్చిన సందర్భంగానూ దీపావళి జరుపుకొన్నట్లుగా చెబుతుంటారు. ఇలా దీపాలు వెలిగించి సంబురాలు చేసుకుంటారు.

ఉమ్మడి జిల్లా సిద్ధం

చెడు, చీకటిపై నాడు సాధించిన మంచి విజయాలకు గుర్తే ఈ పండుగ. పర్వదినాన్ని ఘనంగా నిర్వహించేందుకు ప్రజలు సిద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఇండ్లను ముస్తాబు చేసుకోవడంతో పాటు లక్ష్మీ పూజలను జరుపుకోనున్నారు. దీపావళికి చాలా మంది నోములు ఆచరిస్తారు. పిండివంటలను చేసుకోవడం, కొత్త దుస్తులు వేసుకోవడం, పూజ చేయడం జరుగుతుంది. చివరికి దీపావళి ప్రత్యేకంగా నిలిచే పటాకులను కాల్చడం జరుగుతుంది. ఇంటిలో పెద్దలు, పిల్లలంతా ఇండ్ల ముందు మట్టి దీపాలను, కొవ్వొత్తులను వెలిగిస్తారు. మహాలక్ష్మీ పూజ నిర్వహించడం ఈ పండుగ విశిష్టత. వ్యాపారులు, ప్రజలంతా దేవి కటాక్షం కోసం పూజలు చేస్తారు. పూర్వం దుర్వాస మహర్షిని అవమానించిన ఇంద్రుడిని శపిస్తే రాజ్యం, సంపదలు కోల్పోతాడు. దీనిపై శ్రీమహావిష్ణువు ఇంద్రుడు శరణు కోరితే లక్ష్మీదేవిని పూజించాలని చెప్తే ఆ తర్వాత దేవి కటాక్షంతో ఇంద్రుడు రాజ్యం, సంపదలను తిరిగి పొందుతాడు. దీనివల్ల లక్ష్మీపూజను దీపావళి రోజు చేసుకుంటే అదృష్టం కలిసి వస్తుందని భక్తుల భావన. అనంతరం పటాకులు కాలుస్తూ సంబురాలు చేసుకొంటారు.

వివిధ ఆకృతుల్లో ఉన్న దీపంతులు

అమ్మకానికి ఉన్న దీపంతులు

జోరుగా పటాకుల విక్రయాలు

దీపావళి పండుగ అంటేనే ఠక్కున గుర్తొచ్చేది పటాకులు.. వివిధ రకాల క్రాకర్స్‌ను కాల్చడంతో చిన్నారుల నుంచి పెద్దల వరకు ఎంతో ఉత్సాహం చూపుతారు. వారం రోజులు ముందు నుంచే పటాకుల దుకాణాలు వెలిశాయి. దీంతో కొనుగోళ్లు షురూ అయ్యాయి. వనపర్తి జిల్లా కేంద్రంలోని బాలుర జూనియర్ కళాశాల మైదానంలో దుకాణాలు ఏర్పాటు చేశారు. 17 స్టాల్స్‌ను ఏర్పాటు చేయగా అందులో వివిధ రకాల పటాకులు ఉన్నాయి. సురుసుర బత్తులు, మిరపకాయ టపాసులు, ఎల్లిపాయ బోనాలు, పెన్సిల్ బోనాల్, చిటపట్‌లు, గన్నులు, రీల్ బోనాలు, లక్ష్మీ బోనాలు, అగ్గిపెట్టె బోనాలు, పాము బోనాలు, చిచ్చుబుడ్లతో పాటు 12 షాట్స్, 60 షాట్స్, 120 షాట్స్, హండ్రెడ్ వాలా, టుహండ్రెడ్ వాలా, టూథౌసెండ్ వాలా.., ఫైథౌసెండ్ వాలాలు ఉన్నాయి. రూ.5 నుంచి రూ.5 వేల వరకు ధరల అందుబాటులో ఉన్నాయి. ఈ ఏడాది నూతనంగా బుల్లెట్ గన్, కలర్‌షాక్‌లు కూడా వచ్చాయి. వివిధ డిజైన్లలో లాంతర్లు, ఏనుగు బొమ్మలతో ఆకట్టుకునేలా దీపాలు ఉన్నాయి. అమావాస్యనాడు వెలిగించే దీపాలతో వచ్చే అగ్నితో తేజస్సు, ఆహారాన్ని పొందుతారు. దీంతో దీపాల్లోని నీలం, పసుపు, తెలుపు రంగులు మానవ మనుగడకు సమస్త గుణముల సమ్మేళనంగా చెబుతుంటారు. కొత్తగా వెండి, బంగారం ఆభరణాలు కొనుగోలు చేసి లక్ష్మీ పూజలో పెడితే అష్టైశ్వర్యాలు సిద్ధిస్తాయని, ధనలక్ష్మి, కుబేరులను భక్తి శ్రద్ధలతో పూజిస్తారు. ఇలా ధనత్రయోదశి రోజు ఏ వస్తువు కొన్నా అది అమృత భాండం అవుతుందని నమ్ముతారు.

మార్కెట్లలో సందడి

దీపావళి పండుగ రోజు ఇండ్లల్లో దీపాలు వెలిగించుకుంటారు. మట్టితో తయారు చేసిన ప్రమిదలు మార్కెట్‌లోకి వివిధ రకాల్లో వచ్చాయి. సైజుల మేరకు ధర నిర్ణయించి విక్రయిస్తున్నారు. ఈ మట్టి ప్రమిదలను వెలిగించి అనంతరం నదుల్లో వదులుతుంటారు. ఈ సీజన్‌లో వచ్చే బంతి, చామంతి పూలు కూడా రాసులుగా పోసి అమ్ముతున్నారు. నోములకు ప్రత్యేకమైన మట్టికుండలతోపాటు రంగురంగులతో కూడిన కుండలు కూడా మార్కెట్ అందుబాటులో ఉన్నాయి. అలాగే మిఠాయి దుకాణాలు, వస్త్ర దుకాణాలు కొనుగోలుదారులతో కిక్కిరిసి దర్శనమిస్తున్నాయి. మార్కెట్లనీ సందడిగా మారా యి. ఆదివారం మరింత రద్దీ కనిపించే అవకాశం ఉన్నది.

పెరిగిన ధరలు

గతేడాది కన్నా ఈసారి 30 శాతం ధరలు అదనంగా పెరిగాయి. దీంతో అమ్మకాలు తక్కువగా జరిగే అవకాశం ఉన్నదని, లాభాలు కూడా అంతంతే వస్తున్నాయని వ్యాపారులు వాపోతున్నారు. ధరలు పెరుగుతున్నా పండుగ రోజు క్రాకర్స్‌ను కాల్చాక తప్పదు. ధర ఎంతున్నా కొనుగోళ్లు చేయాల్సింది.

13న కుల్కచర్లలో మంత్రి కేటీఆర్ రోడ్ షో

గండీడ్, నవంబర్ 11 : పరిగి నియోజకవర్గం కుల్కచర్లలో ఈ నెల 13వ తేదీన ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ రోడ్ షోను విజయవంతం చేయాలని గండీడ్ మండల బీఆర్‌ఎస్ అధ్యక్షుడు పెంట్యానాయక్ తెలిపారు. ఉమ్మడి మండలం నుంచి ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు అధిక సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమానికి పరిగి ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి కొప్పుల మహేశ్‌రెడ్డి తోపాటు పలువురు సీనియర్ నాయకులు హాజరవుతున్నారని తెలిపారు. ఉమ్మడి గండీడ్, మహ్మదాబాద్ మండలాల నుంచి అధిక సంఖ్యలో సంఖ్యలో తరలి రావాలని పిలుపునిచ్చారు.